అభివృద్ధి పనులు ప్రారంభం



సీసీరోడ్డు శంకుస్థాపనలో మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: దశల వారీగా సీసీ రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్‌లోని 3వ డివిజన్‌లో రూ. 89.50లక్షలతో, 6వ డివిజన్‌లో రూ. 37లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులకు గురువారం టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు అధిక ప్రాధాన్యనిస్తున్నట్లు వివరించారు. ప్రారంభించిన పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్, కార్పొరేటర్లు కొత్త చందర్‌గౌడ్, బింగి జంగయ్య యాదవ్, కో- ఆప్షన్ సభ్యులు రంగ బ్రహ్మన్నగౌడ్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్, నాయకులు కుర్రి శివశంకర్, కొత్త సుశాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

సత్యదేవుని ఆలయ ఘటనపై విచారణ



విచారణ చేపడుతున్న అధికారులు

ఉప్పల్ : ఇందిరానగర్‌లోని రమాసహిత సత్యనారాయణస్వామి ఆలయంలో ఇటీవల అయ్యప్ప స్వాములకు ఆలయ ఫ్యామిలీ ఫౌండర్ సభ్యుడికి మధ్య జరిగిన వివాదాస్పద ఘటనల గురించి గురువారం రాష్ట్ర దేవాదాయశాఖ అధికారులు హాజరై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వాములు, స్థానికులు దేవాదాయశాఖ అధికారులకు జరిగిన విషయాన్ని వివరించారు. ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కోట్ల నర్సింహారెడ్డి తాను ఎలాంటి తప్పులు చేయలేదని, దేవాలయానికి సంబంధించిన సీటిని వృధా చేయొద్దని మాత్రమే చెప్పానన్నారు. సమగ్ర విచారణ అనంతరం తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. దేవాదాయశాఖ సూపరింటెండెంట్ మోహన్, ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్, ఈవోలు వీరేశం, భాగ్యలక్ష్మి, అంజయ్య, రవికుమార్, చంద్రమోహన్, శంకర్ పాల్గొన్నారు.

కార్మికులకు రెండు పూటల పని విధానం రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రవిచంద్ర

ఘట్‌కేసర్: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు రెండు పూటల పని విధానం రద్దు చేయాలని తెలంగాణ మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రవిచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని మహిళా సంక్షేమ భవనం వద్ద రాంచందర్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, అవుట్ సోర్సింగ్ విధానం రద్దు చేసి రూ. 26 వేలు కనీస వేతనం చెల్లించాలని కోరారు. మున్సిపాలిటీలో విలీనమైన పంచాయతీ కార్మికులకు, మున్సిపల్ కార్మికుల విధానాలు, ఈఎస్‌ఐ, పీఎఫ్ అమలు చేయాలన్నారు. మున్సిపల్ యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా ఈశ్వర్, ఉపాధ్యక్షులుగా సువర్ణ, శ్రావణి, శోభ, భూపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా రాంచందర్, సహాయ కార్యదర్శులుగా రాంకుమార్, గణేష్, నగేష్, కోశాధికారులుగా అరుణ, ఆర్గనైజర్స్‌గా లక్ష్మి, భారతమ్మ, సలహాదారులుగా మల్లేష్, నరసింహా, బాలయ్యను ఎన్నుకున్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు సాంకేతిక ఎత్తుగడలతో వినూత్నమైన ఆలోచనలు చేస్తే భావి భారత శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మల్లాపూర్ కస్తూర్బా పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన – 2024 నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. పలు నమూనాలను కార్పొరేటర్ పరిశీలించారు. పలు ఎగ్జిబిట్‌లు ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్ ఇంతియాజ్ బేగం, చైర్మన్ మహ్మద్ ఇస్మాయిల్, స్థానిక నేతలు ఎస్వీ శివకుమార్, ప్రవీణ్‌రాజుయాదవ్, శ్రవణ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలమల్లేష్‌కు నివాళి



అల్వాల్: సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలమల్లేష్ దశ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం జరిగిన కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే వెంకట్‌రెడ్డి హాజరై నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాలమల్లేష్ ప్రజలకోసం ఎంతో పని చేశారన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జాతీయ అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్, నీలకంటి సత్యం, రత్నాకర్, మాజీ ఎంపీ అజీజ్‌పాషా, జిల్లా కార్యదర్శి సాయిలుగౌడ్, బీకేయంయూ రాష్ట్ర అధ్యక్షులు కాంతయ్య, ఏసురత్నం, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జీవీపీ అమలులో కాప్రా ఆదర్శం

- సిబ్బంది పనితీరుపై సంతృప్తి • ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లాలి • జీహెచ్‌ఎంసీ హెల్త్ అండ్ శానిటేషన్ అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్



సిబ్బందితో కలిసి భోజనం చేస్తున్న కమిషనర్ రఘుప్రసాద్

ఉప్పల్ : శానిటేషన్ అమలు చేయడంలో కాప్రా సర్కిల్ మొదటి స్థానంలో నిలిచిందని జీహెచ్‌ఎంసీ హెల్త్ అండ్ శానిటేషన్ అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్ అభినందించారు. కాప్రా సర్కిల్, కుషాయిగూడలో వ్యర్థాలతో నిండిపోయిన (గార్బేజ్ వల్నరబుల్ పాయింట్) ఎలిమినేషన్ పాయింట్‌ను గుర్తించిన శానిటేషన్ అధికారులు గత నెల రోజులుగా ఆ ప్రాంతంలో వ్యర్థాలు పారవేయకుండా మైక్‌లో అవగాహన కల్పించారు.

సీసీ కెమెరాల పర్యవేక్షణలో..

సీసీ కెమెరాలతో పర్యవేక్షణలో ఉంచి ఆ పాయింట్‌ను పరిశుభ్రంగా మార్చారు. సుమారు 60 ప్రాంతాల్లో మైక్‌లు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

ఉల్లాసంగా సహపంక్తి భోజనాలు..

అధికారులు కుషాయిగూడలో దుర్గంధభరితమైన ప్రాంతాన్ని చెత్తను తొలగించి జీవీపీ ఎలిమినేషన్‌తో పరిశుభ్రంగా మార్చేశారు. గురువారం అక్కడే శానిటేషన్ సిబ్బంది సంబరాలు నిర్వహించుకుని సహపంక్తి భోజనాలు చేశారు.

అధికారుల తీరుపై హర్షం..

కాప్రా సర్కిల్ డీసీ జగన్‌నాయక్‌తో కలిసి హాజరైన రఘుప్రసాద్ ఆశించిన ఫలితాలను సాధించే దిశగా ముందుకెళ్తున్న కాప్రా సర్కిల్ అధికారుల తీరు సంతోషకరమన్నారు. జీవీపీ ఎలిమినేషన్ అమలులో కాప్రా మొదటిస్థానంలో నిలిచిందని,మిగతా సర్కిళ్ల అధికారులు కాప్రాను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం శానిటేషన్ సిబ్బంది పనితీరును మెచ్చుకుంటూ.. వారిని అభినందించారు.



శానిటరీ అధికారులు విడుదల చేసిన చిత్రం

చెత్త రహితంగా..

ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ.. చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దాలని చెప్పారు. కాప్రా సర్కిల్ హెల్త్ అండ్ శానిటేషన్ హెడ్ ప్రశాంత్, శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, ఎస్ఎఫ్ఏలు, జవాన్లు, చెత్త ఆటోరిక్షా కార్మికులు పాల్గొన్నారు.

మీ సేవా నిర్వాహకుల నూతన కార్యవర్గం



మల్కాజిగిరి: మల్కాజిగిరి మండల మీ సేవ నిర్వాహకుల సంఘం నూతన కార్యవర్గం గురువారం నేరేడ్‌మెట్ అంబేడ్కర్ భవన్‌లో ఎంపిక జరిగింది. సంఘం అధ్యక్షుడిగా రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నరేష్, సహాయ కార్యదర్శిగా జయశ్రీ, కోశాధికారిగా మధుసూదన్, కార్యనిర్వాహక కార్యదర్శిగా మల్లికార్జున్, సభ్యులుగా నవీన్, అనీల్, ప్రదీప్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సునీల్‌రెడ్డి, సాయి, కన్యాకుమారి, మాధవి, చంద్రకాంత్, ప్రమోద, జమున పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ తుర్కపల్లి కాలనీలో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను గురువారం కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ.. త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు డీఈ మహేష్, ఏఈ రవళి, వర్క్ ఇన్‌స్పెక్టర్స్, కాంగ్రెస్ నేతలు సురేందర్‌రెడ్డి, ఆనంద్, రమేష్, బాల్‌రెడ్డి, లడ్డూ, వెంకట్, సత్యనారాయణ, శోభన్, రాజు, రఘు, విష్ణు, దేవ, నర్సింగ్, కొండయ్య, బబ్లూ తదితరులున్నారు.

అతిగా మద్యం సేవించడంతోనే..

మద్యం మత్తులో వ్యక్తి మృతి

మేడిపల్లి: అతిగా మద్యం సేవించిన ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూల్‌కు చెందిన కొడిదల మహేంద్ర (27) భార్య, పిల్లలు, తండ్రితో కలిసి బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ బొల్లిగూడెం, సూరజ్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. గురువారం ఉదయం బహిరంగ ప్రదేశంలో మహేందర్ మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. గత 4 రోజులుగా ఇంటికి వెళ్లకుండా మద్యం సేవించాడని స్థానికులు చెబుతున్నారు. మద్యం మత్తులోనే మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థులకు మ్యాథ్స్ కీలకం



సర్టిఫికెట్లు అందజేసిన డీఈవో విజయకుమారి

మల్కాజిగిరి: విద్యార్థులకు మ్యాథ్స్ సబ్జెక్ట్ కీలకమని మేడ్చల్ జిల్లా విద్యాధికారి విజయ కుమారి అన్నారు. గురువారం తెలంగాణ మ్యాథ్స్ ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు మల్కాజిగిరి బాలుర పాఠశాల ఆవరణలో ప్రతిభాపాటవ పరీక్షలు నిర్వహించారు. విజయ కుమారి మాట్లాడుతూ.. పోటీ పరీక్షల్లో మంచి మార్కులు రావాలంటే మ్యాథ్స్ కీలకమన్నారు. ఇంగ్లిష్ మీడియం, తెలుగుమీడియం పోటీల్లో జిల్లా పరిషత్ హైస్కూల్ బాచ్‌పల్లి విద్యార్థి విజయ్, నాగోల్ పాఠశాలకు చెందిన ప్రసాద్ మొదటి స్థానం, బాచ్‌పల్లి పాఠశాలకు చెందిన మహేష్, బాలాజీనగర్‌కు చెందిన ఆర్.ఉమశ్రీ ద్వితీయ స్థానం, మల్లంపేట్ పాఠశాలకు చెందిన జీవిత ఘట్‌కేసర్ పాఠశాలకు చెందిన శరత్ తృతీయ స్థానంలో నిలిచి, రాష్ట్రసాయి పోటీలకు ఎంపికయ్యారు.డీఈవో, ఎంఈవో సురేష్ వారికి సర్టిఫికెట్లు అందజేశారు. పాపిరెడ్డి, రాజు, గోవింద్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మానవాళికి భగవద్గీత మార్గదర్శనం



గీతా జయంతిలో పాల్గొన్న ప్రముఖులు

ఉప్పల్: మానవాళిని సన్మార్గంలో నడిపే మార్గదర్శనం చేసే ఆధ్యాత్మిక గ్రంథం భగవద్గీత అని, భారతీయ సంస్కృతికి భగవద్గీత గొప్ప గోపురం లాంటిదని వక్తలు అన్నారు. రామంతాపూర్ ఆర్టీసీకాలనీ కమ్యూనిటీహాల్‌లో భగవద్గీత శ్లోకాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. శ్రీకృష్ణ పరమాత్ముడు ప్రపంచానికి భగవద్గీతను ఉపదేశించిన రోజే గీతాజయంతి అని, భక్తి పూర్వకంగా గీతను పఠిస్తే అన్ని శుభాలే జరుగుతాయన్నారు. హైకోర్టు అడ్వకేట్ జీఎల్.నరసింహారావు ప్రముఖ రచయిత్రి డాక్టర్ కే.వి.కృష్ణకుమారి, సినీనిర్మాత గోపాలకృష్ణ, సీనియర్ సిటిజన్ సంఘం అధ్యక్షుడు కపర్తీశ్వర్ రావు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఆచార్యులు సుబ్రహ్మణ్యం, లలితావాణి, భారతి కమలాకర్, కృష్ణవేణి, లలితాపరమేశ్వరి పాల్గొన్నారు.

ఎస్టీపీ ప్లాంట్ పరిశీలన



ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: సఫిల్‌గూడ చెరువు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్టీపీ ప్లాంట్ వినియోగంలోకి రావాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ అధికారులకు సూచించారు. గురువారం నూతనంగా ఏర్పాటుచేసిన 5.5 ఎంఎల్‌డీ ఎస్టీపీని ఆయన పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. నూతన ఎస్టీపీ కోసం పోరాటం చేయడమే కాకుండా కౌన్సిల్ సమావేశంలో కూడా ప్రస్తావించామని పేర్కొన్నారు. మురుగు నాలాలను సైతం అనుసంధానం చేసి శుద్ధి చేసేందుకు కార్యాచరణను సిద్ధం చేయాలని, నిధులు సేకరణకు కృషి చేస్తామన్నారు.



తవ్వారు.. వదిలేశారు

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ పరిధిలో బ్యాంక్ కాలనీ టర్నింగ్ వద్ద జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు తవ్విన గుంతలో బండరాయి రావడంతో వదిలేశారు. గత నెలరోజులుగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు కాలనీలకు రాకపోకలు నిలిచిపోయాయి.

కార్పొరేటర్ వివరణ..

వరద నీటి కాలువల మరమ్మతుల కోసం నీరు సాఫీగా వెళ్లేందుకు కాలువ విస్తరణ పనులు చేపట్టాం. పనుల్లో జాప్యం జరిగిన విషయం వాస్తవమే. త్వరలోనే పనులు పూర్తి చేస్తామని కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ వివరించారు.

గంజాయి చాక్లెట్ల పట్టివేత

పోచారం: బోడుప్పల్, గౌతంనగర్‌లో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న వ్యక్తిని ఎస్టీఎఫ్ బృందం గురువారం అదుపులోకి తీసుకుంది. బీహార్ నుంచి గంజాయి చాక్లెట్లను తీసుకొచ్చి అమ్ముతున్నట్లు పోలీసులు అదుపులో ఉన్న వీరేంద్ర పాండే ఒప్పుకున్నాడు. ఒక్కో చాక్లెట్‌ను రూ. 15 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిసింది. నిందితుడిని అదుపులోకి తీసుకోవడంతో పాటు 4.957 కేజీల గంజాయి చాక్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

చిరు వ్యాపారులను వేధించడం సబబు కాదు



మేడ్చల్: రోడ్డు విస్తరణ పేరుతో మేడ్చల్ మార్కెట్‌లో చిరు వ్యాపారులను మున్సిపల్ అధికారులు ఇబ్బంది పెట్టడం సరికాదని బీజేపీ నాయకుడు సుదర్శన్‌రెడ్డి అన్నారు. గత నాలుగు రోజులుగా మేడ్చల్ మార్కెట్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టి అందులోని ఆక్రమణలను మున్సిపల్ అధికారులు తొలగించారు. చిరు వ్యాపారులు తమ అడ్డాలు కోల్పోయి నిరాశ్రయులు కావడంతో స్థానిక బీజేపీ నాయకులతో కలిసి సుదర్శన్‌రెడ్డి మార్కెట్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ అధికారులు పోలీసులను అడ్డుపెట్టుకుని ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. వ్యాపారులకు అన్యాయం జరగకుండా బీజేపీ అండగా నిలబడుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆంజనేయులు, శ్రీకాంత్, సుధాకర్‌రెడ్డి,శ్రీనివాస్‌గౌడ్, హేమలతారెడ్డి, రాఘవరెడ్డి, అర్జున్,వంశీవిజయ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి పల్లకి ఊరేగింపు



అల్వాల్: ఓల్డ్ అల్వాల్‌లోని బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం ఆలయ వంశపారపర్య చైర్మన్ రాజాగోపాల్ సైన్సర్, ఈవో వీరేశం నేతృత్వంలో స్వామివారిని పల్లకి సేవలో పురవీధుల్లో ఊరేగించారు. యజ్ఞాచార్యులు విజయసారధి, అర్చకులు రఘు, శ్రీనివాస్, రమణ, సిబ్బంది వెంకట్‌రెడ్డి, స్వామి, శ్రీకాంత్, రాజు, సేవకులు వెంకటరామిరెడ్డి, శివరామకృష్ణ, రామచంద్రరావు తదితరులున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీదేవి

ఉప్పల్ : సీఎం రిలీఫ్ ఫండ్ పేదల పాలిట వరమని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. చర్లపల్లి డివిజన్, అనారోగ్యం బారిన పడ్డ బీఎన్‌రెడ్డినగర్‌కు చెందిన క్యాబ్‌డ్రైవర్ సదానంద్ కుమార్తె శిల్ప కుటుంబసభ్యులకు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరైన రూ. లక్ష చెక్కును అందజేశారు. అత్యవసర పరిస్థితుల్లో పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఇది దోహదపడుతుందని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సంప్రదాయాలు పరిరక్షించుకోవాలి



కార్యక్రమంలో విద్యాధికారి జ్యోతి, విద్యార్థులు

అల్వాల్: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మల్కాజిగిరి మండల విద్యాధికారి జ్యోతి అన్నారు. భారతదేశ చరిత్రలో మహనీయులను స్మరిస్తూ దేశ సంస్కృతి, సాంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాలనే ఉద్దేశంతో అల్వాల్‌లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 'భారతీయం' పేరుతో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డీఎంఈవో రవీందర్‌రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి, బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన



న్యూ రాఘవేంద్రనగర్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ శాంతి

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని న్యూ రాఘవేంద్రనగర్ కాలనీలో గురువారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ పర్యటించారు. డ్రైనేజీ, సీసీ రోడ్ల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆర్ఎస్. తిరుమల టవర్ నుంచి శాంతి గార్డెన్స్ వరకు నిధులు మంజూరైనా.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు పెండింగ్ ఉన్నాయన్నారు. నిధులు మంజూరు చేయించి పూర్తిస్థాయిలో డ్రైనేజీ, సీసీరోడ్లను వేయిస్తామని కాలనీవాసులకు కార్పొరేటర్ హామీ ఇచ్చారు. కార్పొరేటర్ డీఈ బాలకృష్ణ, ఏఈ కీర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.


ప్రెస్‌క్లబ్‌కు వాటర్ ఫిల్టర్ అందజేత



వాటర్‌ఫిల్టర్‌ను అందజేసిన మాజీ కార్పొరేటర్ పావనీరెడ్డి

కాప్రా: కాప్రా ప్రెస్‌క్లబ్‌కు మాజీ కార్పొరేటర్ పావనీరెడ్డి వాటర్ ఫిల్టర్‌ను అందజేశారు. ఆమె భర్త మణిపాల్‌రెడ్డి జయంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆమె మాట్లాడుతూ.. ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి మణిపాల్‌రెడ్డి ఎంతో కృషి చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆయన స్మారకంగా అదనపు గది కూడా నిర్మించినట్లు చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని సేవాకార్యక్రమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కాప్రా ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు శ్రీనివాస్, శంకర్, నర్సింగ్‌గౌడ్, విజయ్‌కుమార్, గోపాల్, కేసీ మోహన్, సహదేవచారి, భాస్కర్‌రెడ్డి, బాల్‌రాజు, బాల్‌రెడ్డి, రమేష్, నాయకులు వంజరి ప్రవీణ్, రమాదేవి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు



ఎమ్మార్వోకు వినతిపత్రం ఇస్తున్న ధర్మసమాజ్ పార్టీ నేతలు

మేడిపల్లి: రాష్ట్రంలోని అర్హులైన నిరుపేదలకు ఉచిత విద్య, వైద్యం అందించడంతో పాటు ఇళ్లు, భూమి అందించి ఉపాధి అవకాశాలను కల్పించాలనే డిమాండ్‌తో ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మేడిపల్లి మండల ఎమ్మార్వో ఆఫీస్ వద్ద రిలే నిరాహార దీక్షలు 4వ రోజుకు చేరాయి. 5 డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతిపత్రాన్ని మేడిపల్లి మండల ఎమ్మార్వోకు అందజేశారు. ఈ సందర్భంగా మేడిపల్లి మండల కన్వీనర్ పారునంది వెంకేర్ మాట్లాడుతూ.. పేదలకు ఉచిత విద్య, వైద్యం, భూమి, ఇళ్లతో పాటు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ధర్మ సమాజ్ పార్టీ మేడిపల్లి మండల కో - కన్వీనర్ కుమార్, మేడ్చల్ జిల్లా కో - కన్వీనర్ శివకుమార్, ప్రవీణ్‌కుమార్, బాబు తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన

ఉప్పల్ : రాచకొండ ఎస్ఓటీ డీసీపీ మురళీధర్ ఆదేశాల మేరకు రాచకొండ 'యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్' (ఏహెచ్‌టీయూ) ఆధ్వర్యంలో గురువారం రాధిక చౌరస్తాలోని ఓ ప్రైవేటు కళాశాలలో విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, బాల్యవివాహాలు, బాలికలపై లైంగిక వేధింపులు, యాంటీ ర్యాగింగ్, సెల్‌ఫోన్, మైనర్ రైడింగ్ తదితర నేరాలతో పాటు బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్, బీఎస్ఏలపై విద్యార్థులకు వివరించారు. చట్టాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు ఇంట్లో వారికి కూడా చెప్పాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. మానవ అక్రమ రవాణాలో ప్రపంచంలో దేశం మూడోస్థానంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సైబర్ మోసాలకు గురైన వారు డయల్ 1930, హెల్ప్‌లైన్ 1091, 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 109, 112 డయల్ 100లను వినియోగించుకుని రక్షణ పొందాలన్నారు. ఎస్సై రాములునాయక్, ఏఎస్ఐ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వినియోగంపై..

మేడిపల్లి: డ్రగ్స్ వినియోగానికి విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని విద్యార్థులకు మేడిపల్లి పోలీసులు సూచించారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కేశవ మెమోరియల్ ఇంజినీరింగ్ కాలేజ్ పర్వతాపూర్‌లో డ్రగ్స్, మహిళల సంబంధిత, సమస్యలు, సైబర్ నేరాలు, ట్రాఫిక్ తదితర విషయాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. మేడిపల్లి పోలీసులు విద్యార్థులతో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాలు డ్రగ్స్, ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసలైతే విలువైన జీవితం నాశనమవుతుందన్నారు. విద్యాసంస్థల నిర్వాహకులు, తల్లిదండ్రులు తమ పిల్లలపై ఓ కన్నేసి ఉంచాలన్నారు. టీజీఎస్ఏబీ, డీయస్పీ రమేష్, ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, షీ టీమ్ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు



అవగాహన కార్యక్రమంలో పోలీసులు, విద్యార్థులు